


"మరణానికి భయపడటమంటే చిరిగిపోయిన బట్టని వదిలేందుకు భయపడటం."

- మహాత్మ గాంధీ

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 54 | శనివారం 19 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi






## కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి పొందాలి

- నిమిష ప్రియ కేసు.. చర్చల కోసం యెమెన్‌కు వెళ్లడంపై కేంద్రం అనుమతి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు
- బాధిత కుటుంబంతో మాట్లాడేందుకు యెమెన్‌కు వెళ్లడానికి అనుమతి కోరిన బృందం
- తమ వైపు నుంచి చర్యలు చేపడుతున్నామన్న కేంద్రం
- కేంద్రం స్పందనపై సుప్రీంకోర్టు సంతృప్తి

2లో

### నియోజకవర్గాల అభివృద్ధికి

## ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు

### - కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు - సూర్య వాస్తవం, జూలై 18:

నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున గ్రాంటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. నియోజవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇన్‌ఛార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మెల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సిఎం, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ దృష్టికి సూర్జేవాలా తీసుకెళ్లినట్లు



తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య గ్రాంటు విడుదలకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంటును పొందనున్నారు.



## ఏపీకి మరో మూడ్రోజులు భారీ వర్ష సూచన

- రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఏపీఎస్డీఎంఏ అలర్ట్ - పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 18:

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

- మిగతా 2లో..

### సంపన్నులు

## సాయం చేయాలి

- పి-4 మార్గదర్శుల విందులో సిఎం చంద్రబాబు
- ఆగస్టు కల్లా 15 లక్షల మందిని దత్తత తీసుకోవాలి


2లో

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం

- త్వరలో గేమ్ ఛేంజర్ అవుతుంది
- తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తికి పరిశోధనలు పెరగాలి
- పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు : ముఖ్యమంత్రి చంద్రబాబు
- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

గుంటూరు - సూర్య వాస్తవం, జూలై 18:

: రానున్న కాలంలో రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తికి నిపుణులు, ఆయా కంపెనీలు పరిశోధనలు చేయాలని సూచించారు. రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. 1999లో తాను తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల 2004లో అధికారం కోల్పోయినా వెనక్కి తగ్గలేదన్నారు. 2014లో మళ్లీ సంస్కరణలు కొనసాగించి ప్రజలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం ఉత్పత్తి, స్టోరేజీపై దృష్టి పెట్టాలని కోరారు. రెండు రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ఇస్తామన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. అందుకు తగిన



మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలన్నారు. 2070 నాటికి కర్బన రహిత ఇంధనాలు వాడాలన్న లక్ష్యానికి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని ప్రకటించారు. ఇంధన ఖర్చు తగ్గాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యమని అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ

- మిగతా 2లో..



## ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఉప్పాడను చాలాకాలంగా వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్య
- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు
- ఎన్డీయే ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2లో

## రాష్ట్రానికి ఏం కావాలో వివరించండి

- టిడిపి ఎంపిలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

2లో



### ప్రజల్లోకి

## సంక్షేమ కార్యక్రమాలు

### - హోంమంత్రి అనిత



అమరావతి - సూర్య వాస్తవం, జూలై 18:

వైసిపి కుట్రలను తిప్పికొడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో

- మిగతా 2లో..

### 10 లక్షల కోట్ల అప్పులు..

## 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చారు

- రాష్ట్రంలో ఇక డంపింగ్ యార్డులు కనిపించవు
- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- విదేశీ తరహాలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను తీసుకొస్తున్నాం: ఎమ్మెల్యే దగ్గుపాటి
- బయో మైనింగ్ పేరుతో గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడ్డారన్న ఎమ్మెల్యే
- డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 18:

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి మంచి చేయకుండా... 10 లక్షల కోట్లు అప్పు.. 85 లక్షల టన్నుల చెత్తను మిగిల్చిపోయారని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. అనంతపురం డంపింగ్ యార్డ్ లో



ఇవాళ బయో మైనింగ్ ప్రక్రియను ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. 7 డివిజన్లలో కోటి 70 లక్షలతో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ..

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి పొందాలి

**- నిమిష ప్రియ కేసు.. చర్చల కోసం యెమెన్‌కు వెళ్లడంపై కేంద్రం అనుమతి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు**
**- బాధిత కుటుంబంతో మాట్లాడేందుకు యెమెన్‌కు వెళ్లడానికి అనుమతి కోరిన బృందం**
**- తమ వైపు నుంచి చర్యలు చేపడుతున్నామన్న కేంద్రం**
**- కేంద్రం స్పందనపై సుప్రీంకోర్టు సంతృప్తి**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 18**
యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో, బాధితుని కుటుంబంతో మాట్లాడేందుకు యెమెన్‌కు వెళ్ళడానికి అనుమతి కోరుతూ ఆమె తరఫు న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి పొందాలని సూచించింది. నిమిష ప్రియ కేసును సుప్రీంకోర్టు తాజాగా మరోసారి విచారించింది. ఈ సందర్భంగా, నిమిష ప్రియకు విధించిన మరణశిక్షను యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈ కేసులో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టుకు తెలియజేశారు. నిమిష ప్రియ క్షేమంగా స్వదేశానికి తిరిగి రావాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నిమిష ప్రియ కేసులో కేంద్ర ప్రభుత్వం స్పందన పట్ల సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో కేంద్రం సాధ్యమైనంత వరకు ప్రయత్నాలు చేస్తోందని పేర్కొంది.

విచారణ సందర్భంగా, నిమిష ప్రియ తరఫు న్యాయవాదుల బృందం ఒక అభ్యర్థనను కోర్టుకు సమర్పించింది. బాధితుని కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు యెమెన్‌కు వెళ్ళడానికి అనుమతి ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం యెమెన్‌కు వెళ్లడానికి ఆంక్షలు ఉన్నందున, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 14కు వాయిదా వేసింది.

# ఏపీకి మరో మూడ్రోజులు భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)
ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శనివారం నాడు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల కారణంగా ఏర్పడే వరదలు, జలమయ ప్రాంతాల్లో ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ అధికారులు సూచించారు.

# సంపన్నులు సాయం చేయాలి

**- పి-4 మార్గదర్శుల విందులో సిఎం చంద్రబాబు**
**- ఆగస్టు కల్లా 15 లక్షల మందిని దత్తత తీసుకోవాలి**

**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 18:** సంపన్నులు సాయం చేయాలని తద్వారా పేదరికం పోవాలన్న ఉద్దేశంతోనే పి-4 కార్యక్రమం చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి-4 మార్గదర్శులకు శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి విందు ఇచ్చారు. పి-4పై తన ఆలోచనలను వివరించారు. మార్గదర్శుల అభిప్రాయాలూ తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆగస్టు 15 నాటికల్లా 15 లక్షల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. ఇందుకు సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంధ సంస్థలు కలిసి రావాలని అన్నారు. అంబేద్కర్ నుండి అబ్దుల్ కలాం వరకూ ఎదిగిన వారందరికీ వారి జీవితకాలంలో ఎవరో ఒకరు సాయం చేశారని తెలిపారు. సమాజంలో విజయం సాధించిన వారందరూ సామాజిక బాధ్యతగా తిరిగి ఖర్చు పెట్టాలని సూచించారు. గేట్స్ ఫౌండేషన్ ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తుందని, 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 5 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని, వీరికి సాయం చేసేందుకు 47 వేల మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని వివరించారు.

**నాడు జన్మభూమి.. నేడు పి-4**
47 ఏళ్లుగా తను రాజకీయాల్లో ఉన్నానని, ముఖ్యమంత్రి అయిన తరువాత రెండో విడత సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఐటికి పెద్దపీట వేసి, విద్యకు ప్రాధాన్యత ఇచ్చానని పేర్కొన్నారు. వాటి వల్ల మంచి ఫలితాలు వచ్చి ప్రజలు అభివృద్ధి చెందారని తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావాలన్నదే తన సంకల్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పి-4 వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రముఖులు శ్రీనిరాజు, రవి సన్నారెడ్డి, అనిల్ చలమలశెట్టి, పివి కృష్ణారెడ్డి, ఎవివి రంగరాజు, వివిఎన్ రావు, సజ్జన్‌కుమార్ గోయెంకా వంటి ప్రముఖులు పాల్గన్నారు.

# ప్రజల్లోకి సంక్షేమ కార్యక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర తెలుగు మహిళా విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తోపాటు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. కుట్రలు చేయడం వైసిపికి వెన్నతోపెట్టిన విద్య అని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి రానుందన్నారు. ఈ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పాల్గన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)
లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారని గుర్తు చేశారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంలో రాష్ట్రం ప్రముఖ భాగస్వామిగా ఉంటుందన్నారు. సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో, సామాన్యులు కూడా వ్యయం భరించగలిగేలా ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. విశాఖలోని ఎన్‌టిపిసి సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని రాష్ట్రం నిర్దేశించుకుందన్నారు. మూడు గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితోపాటు సౌర, పవన, పంప్డ్ విద్యుదుత్పత్తికి అపారమైన వనరులు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. అమరావతిలో కృత్రిమ మేధ కేంద్రంగా క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రూ.51 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సమిట్ వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యుకెకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎంఒయు కుదుర్చుకుంది. కెవిఎస్ఎహెచ్ ఇన్ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.35 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

అంతకుముందు సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సిఇఒలు, ఎండిలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. సమ్మిట్‌కు నీతి ఆయోగ్ సభ్యులు వికె.సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్రానికి ఏం కావాలో వివరించండి

**- టిడిపి ఎంపిలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 18:**
కేంద్రం నుండి రాష్ట్రానికి ఏం కావాలో పార్లమెంటు సమావేశాల్లో వివరించాలని, దానిని రాబట్టుకునేందుకు కృషి చేయాలని టిడిపి ఎంపిలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం టిడిపి పార్లమెంటరీ పార్టీతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వివరించారు. రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామీకీకరణ వంటి అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని చెప్పారు. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సహాయాన్ని పార్లమెంట్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న నేరపూరిత రాజకీయాలపై కూడా మాట్లాడాలని అన్నారు. ప్రధాని మోడీ చేస్తున్న మంచి పనులను కూడా సభలో ప్రస్తావించాలన్నారు. ఆపరేషన్ సింధూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు వంటి అంశాలపై జరిగే చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును సమర్ధించాలన్నారు. రాష్ట్ర సమస్యలపై నిరంతరం సంప్రదింపులు జరపాలని, ఎంపిలకు శాఖల వారీగా కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో నిరంతరం మాట్లాడాలని, అదే సమయంలో రాష్ట్ర యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సంప్రదింపుల వల్లే నరేగాకు సంబంధించి రూ.180కోట్ల ఎన్ఆర్ఇజిఎస్ బిల్లులను తిరిగి ప్రక్రియలో పెట్టగలిగామన్నారు.

# ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం

**- ఉప్పాడను చాలాకాలంగా వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్య**
**- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు**
**- ఎన్డీయే ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 18:** పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సముద్ర తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ద్వారా ఉప్పాడలో తీర రక్షణ నిర్మాణాలను అభివృద్ధి చేసే ప్రతిపాదనను సుమారు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని తెలిపారు. "గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైంది, దీంతో సుమారు 12 మీటర్ల తీరం కోల్పోయింది. ఇది సమీప గ్రామాలపై, ముఖ్యంగా మత్స్యకారుల గృహాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎన్‌డీఏ ఎన్నికల వాగ్దానానికి కట్టుబడి, అవసరమైన అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డీఎంఏ ద్వారా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలను సమర్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తారని, హోం మంత్రి అమిత్ షా కాకినాడ ప్రజల ఆకాంక్షలను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉదారంగా సహకరిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు ఆమోదం పొంది, బాధితులకు వారు ఎప్పటి నుంచో కోరుకున్న ఊరట లభిస్తుందని పవన్ కల్యాణ్ తన ట్వీట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

# ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు


**- మంత్రి నాదెండ్ల మనోహర్**

**అమరావతి– సూర్య వాస్తవం, జూలై 18:** ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరలపై రోజువారీ సమీక్షలతోపాటు ఎప్పటికప్పుడు నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రి అధ్యక్షతన మంత్రుల బృందం (జిఒఎమ్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరిపై మార్కెట్ రుసుమును రెండు శాతం నుంచి ఒక శాతానికి తగ్గించే ప్రతిపాదనపై చర్చించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. టమోటా ఉత్పత్తిపై బేరీజు వేసుకుంటూ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని మంత్రుల కమిటీ నిర్ణయించిందన్నారు. సిబ్బంది కొరతను నివారించేందుకు ఇతర శాఖల నుంచి అర్హులైన ఉద్యోగులను శిక్షణతో నియమించాలని సూచించారు.. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గన్నారు.

# 10 లక్షల కోట్ల అప్పులు.. 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చారు



(మొదటిపేజీ తరువాయి)
విదేశీ తరహాలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను తీసుకొస్తున్నామన్నారు. నగరంలో 7 డివిజన్లకు సంబంధించిన డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. వైసిపి నాయకులు 3.30 లక్షల టన్నుల చెత్త తరలిస్తామని అవినీతికి పాల్పడ్డారని, రుకు వచ్చిందని, వాళ్లు రోజుకు 6000 టన్నుల లెగసి క్లియర్ చేస్తున్నారు. అనంతపురం డంపింగ్ యార్డ్ లో 1.65 లక్షల టన్నుల చెత్త మిగిలిపోయింది.. రోజుకు 4 నుంచి 6 వేల టన్నుల చొప్పున చెత్తను తొలగిస్తామన్నారు. వాటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని జిల్లాల పర్యటనలో భాగంగా అనంతపురం జిల్లాకు రావడం జరిగింది తెలిపారు. రాబోయే రోజుల్లో 12.3 ఎకరాల డంపింగ్ యార్డ్ ను మంచి పార్కుగా ఏర్పాటు చేస్తామన్నారు. అమృత పథకం కింద 8,500 కోట్లతో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే రెండు సంవత్సరాలు ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇచ్చే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలలో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలు వందకు వంద శాతం అమలు చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు...



## సంపాదకీయం

# గల్ఫ్ దేశాలలో ఘోష



పుట్టిన ఊరుతో మట్టి సంబంధం ఉంటుంది. పెరిగిన వాతావరణంలో అన్యోన్యత ఉంటుంది.. చుట్టుపక్కల వారితో అనుబంధం ఉంటుంది. ఇవన్నీ తెంచుకోవడం అంటే ఊపిరిని వదిలినట్టే.. మనదేశమే కాదు.. ఏ దేశాల్లో ఉన్న వారైనా సరే అంత సులువుగా ఈ బంధాలను వదులుకోలేరు.. అది అంత సులభం కూడా కాదు..ఉన్నత చదువులు చదివినప్పటికీ.. సరైన ఉద్యోగాలు రాక.. ఉద్యోగాల వల్ల వచ్చే వేతనాలు సరిపోక.. కుటుంబ అవసరాలు పెరిగిపోయి.. ఖర్చులు విపరీతం కావడంతో మనదేశంలో కేరళ రాష్ట్రానికి చెందిన కొందరు ఉద్యోగం కోసం.. మెరుగైన జీవితం కోసం.. సామాజికంగా హోదా కోసం.. గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. కొందరైతే ఆఫ్రికా వంటి ఖండాలకు కూడా వెళ్తున్నారు.. మనదేశంలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేకంగా ఒక కేంద్రం ఉందంటే అది కేరళ రాష్ట్రంలో మాత్రమే.. కేరళ రాష్ట్రానికి చెందిన సినిమాలు మన దేశంతో సమాంతరంగా గల్ఫ్ దేశాలలో విడుదలవుతాయి.. మోహన్ లాల్, మమ్ముట్టి వంటి మలయాళ అగ్ర కథానాయకులు నుంచి మొదలు పెడితే చిన్న స్థాయి నటుల వరకు తమ సినిమాల ప్రమోషన్ల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం పరిపాటి. పైగా గల్ఫ్ దేశాలలో మలయాళీలు ఏకంగా సంఘాలు కూడా కొనసాగిస్తున్నారు. అక్కడ ఆలయాలు కూడా నిర్మిస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక కోణం మాత్రమే.

మరో కోణంలో నిమిష లాంటి ఘటనలు కనిపిస్తూనే ఉంటాయి. అరదుగా మాత్రమే ఇటువంటి దారుణాలలో చిక్కుకున్నవారు బయటపడతారు. మిగతా మంది అక్కడ చట్టాలకు బలవుతుంటారు..కేరళ నుంచి ఎక్కువగా నర్సింగ్, నిర్మాణరంగంలో పనిచేయడానికి వెళుతుంటారు.. గల్ఫ్ దేశాలలో చట్టాలు చాలా విచిత్రంగా ఉంటాయి. అదే సమయంలో కఠినంగా కూడా ఉంటాయి. మన ప్రమేయం లేకపోయినప్పటికీ ఏదైనా జరిగితే దోషులుగా చిత్రీకరిస్తారు. పైగా అక్కడ మనకంటూ ఎవరూ ఉండకపోవడం వల్ల బాధను వినేవాడు ఉండడు.. అక్కడ న్యాయస్థానాలు కూడా పోలీసులు చెప్పింది గుడ్డిగా వింటాయి. మరో మాటకు తావు లేకుండా మరణశిక్షనే విధిస్తుంటాయి. ఇండియన్స్ అంటే అక్కడివారికి ఉండే చులకన భావం కూడా ఒక కారణం. అందువల్లే గల్ఫ్ దేశాలలో మనవాళ్లు చాలా ఇబ్బందికర మైన జీవితాన్ని గడుపుతుంటారు. అంత ఇబ్బందులు పడుకుంటూ అక్కడ ఉండడానికి ప్రధాన కారణం.. మన వాళ్ళ ఆర్థిక పరిస్థితులు స్వదేశంలో బాగో లేకపోవడమే.. పైగా అక్కడి కరెన్సీకి విలువ ఎక్కువగా ఉంటుంది.

స్వదేశంలో ఆర్థిక కష్టాలు.. కుటుంబ నిర్వహణ.. సామాజిక హోదా.. ఆర్థిక స్థిరత్వాన్ని సంపాదించడం.. ఇలాంటి అనేక కారణాలతో చాలామంది గల్ఫ్ దేశాలకు వెళుతుంటారు.. అక్కడ కరెన్సీకి విలువ అధికంగా ఉండడం.. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడం వల్ల కేరళ వాసులు గల్ఫ్ దేశాలకు ప్రయాణం సాగిస్తుంటారు. గల్ఫ్ దేశాలలో చెప్పుకున్నంత స్థాయిలో అవకాశాలు ఉండవు. అక్కడ నిబంధనలు, చట్టాలు అత్యంత దారుణంగా ఉంటాయి. అక్కడ ప్రభుత్వాలు వేసే శిక్షలు కూడా అదే స్థాయిలో ఉంటాయి.. మన ప్రమేయం లేకుండా జరిగిన ప్రమాదాలైనప్పటికీ దోషులుగానే చిత్రీకరిస్తారు. భారత దౌత్య విభాగం రంగ ప్రవేశం చేసేదాకా బయట ప్రపంచానికి ఈ విషయాలను చెప్పరు. పైగా జైళ్లల్లో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంటారు.. ఇవన్నీ కూడా సగటు భారతీయులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంటాయి.. అన్ని ఇబ్బందులు పడుతూ కూడా మన వాళ్లు అక్కడ ఉండడానికి ప్రధాన కారణం సమస్యలే. ఇండియాలో అంతగా అవకాశాలు లేకపోవడం.. ఉన్న అవకాశాలలో వేతనాలు తక్కువగా ఉండడం.. కుటుంబ అవసరాలు విపరీతంగా ఉండడం.. ఇవన్నీ కూడా భారతీయులను గల్ఫ్ దేశాల నుంచి తిరిగి రానివ్వకుండా చేస్తున్నాయి.. నిమిష ప్రియ లాంటి ఉదంతాలు వెలుగులోకి వచ్చినప్పటికీ అరదుగా మాత్రమే ఉన్నత స్థాయిలో స్పందనలు ఉంటున్నాయి. అది కూడా అంతగా పరిష్కార మార్గాన్ని చూపడం లేదు.నిమిష ప్రియ ఉదంతాన్నే పరిశీలనకు తీసుకుంటే.. క్షమా ధనాన్ని ఇస్తామని చెప్పినప్పటికీ బాధిత కుటుంబ సభ్యులు ఒప్పుకోవడం లేదు. మరణ శిక్షణ విధించాలని పట్టుబడుతున్నారు. వాస్తవానికి నిమిష ప్రియ తాను వెళ్లిన దేశంలో క్లినిక్ ఏర్పాటు చేసింది. దాని భాగస్వామ్య వ్యవహరించిన యెమెన్ దేశపు వ్యక్తి ఆమెను ఇబ్బంది పెట్టసాగాడు. గత్యంతరం లేక ఆమె మత్తు ఇంజక్షన్ వేసి అతడి నుంచి తప్పించుకుంది. ఒకవేళ ఆమె గనుక ఆ చర్యకు పాల్పడకపోతే ఏమి ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఆమె తన స్వీయ రక్షణార్థం చేసిన పనిని అక్కడి ప్రభుత్వం తప్పుగా భావిస్తోంది. పోలీసులు కూడా ఆమెను నిర్బంధంలోకి తీసుకొని దోషిగా చిత్రీకరించారు.. అక్కడి కోర్టు కూడా ఆమెకు మరణ దండన విధించింది.

వాస్తవానికి గల్ఫ్ దేశాలలో చట్టాలు అక్కడి ప్రజలకు అనుకూలంగా ఉంటాయి. అక్కడ వారు తప్పు చేసినప్పటికీ రక్షించడానికి అనేక వ్యవస్థలు అండగా ఉంటాయి.యెమెన్‌లో భారతీయ నర్సు నిమిష ప్రియ మరణ శిక్ష వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన తర్వాత.. 94 ఏళ్ల మతగురువు, గ్రాండ్ ముఫ్తీ ఏ.పీ అబూబకర్ ముస్లియార్ గురించి విరీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.యెమెన్‌కు చెందిన తలాల్ అబ్దో మహదీ హత్య కేసులో నిమిష ప్రియకు మరణ శిక్ష పడిరది. ఈ శిక్ష నుంచి నిమిష ప్రియను కాపాడాలంటే.. మహదీ కుటుంబం ఇచ్చే క్షమాభిక్షే అత్యంత కీలకం.కేరళలో అత్యంత గౌరవప్రదమైన, పలుకుబడి ఉన్న ముస్లిం మతనాయకుడు అబూబకర్ ముస్లియార్ నిమిష ప్రియ కేసు గురించి జుల్కై 14న యెమెన్‌లోని కొందరు షేక్‌లతో మాట్లాడినట్లు నిమిష ప్రియను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న సేవ్ నిమిష ప్రియ ఇంటర్ యాక్షన్ కౌన్సిల్ క్యాంపెయిన్ తెలిపింది." సేవ్ నిమిష ప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్ సభ్యులు గ్రాండ్ ముఫ్తీని కలిసి మాట్లాడారు. ఆ తర్వాత, ఆయన యెమెన్‌లోని కొందరు పలుకబడి గల షేక్‌లతో మాట్లాడారు." అని యాక్షన్ కౌన్సిల్ సభ్యుడు, సుప్రీంకోర్టు న్యాయవాది సుభాష్ చంద్ర బీబీసీకి చెప్పారు. మృతుడి బంధువులతో సహా అక్కడ పలుకుబడి ఉన్న వ్యక్తులతో సమావేశం జరిగినట్లు తమకు తెలిసిందని చంద్ర తెలిపారు.

జులై 16న నిమిష ప్రియకు మరణ శిక్ష అమలు చేయాల్సి ఉంది. దానికి 48 గంటల ముందు ముస్లియార్ జోక్యం చేసుకోవడంతో, తలాల్ అబ్దో మహదీ కుటుంబంతో చర్చలు జరిపేందుకు సాధ్యమైంది. కానీ ఇతర దేశస్తులు ముఖ్యంగా భారతీయుల విషయంలో అక్కడి ప్రభుత్వాలు, అధికారులు దారుణంగా వ్యవహరిస్తారని అనేక ఉదంతాలు తెలియజేశాయి.. నిమిషప్రియ ఉదంతం నేపథ్యంలో ఓ ప్రఖ్యాత ఆంగ్ల పత్రికకు తిరువనంతపురం పార్లమెంట్ సభ్యుడు శశిధరూర్ ఒక సంపాదకీయ వ్యాసం రాశారు.. అందులో గల్ఫ్ దేశాలలో ఉండే బాధలను ఆయన ఏ కరువు పెట్టారు. ఒక పార్లమెంటు సభ్యుడు ఆ స్థాయిలో స్పందించి రాశాడు అంటే.. ఆ దేశాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

# మంత్రుల పనితీరుపై అసంతృప్తి...



**విజయవాడ – సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల చేసిన హెచ్చరికలు మంత్రులపైన బాగానే పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. మంత్రులు యాక్టివ్ అయ్యారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మంత్రులు యాక్టివ్ గా లేకపోతే కొత్త వారు వస్తారని చేసిన హెచ్చరికలతో అమాత్యులు పరుగులు పెడుతున్నారు. మొన్నటి వరకూ అనావృష్టి ఇప్పుడు అతి వృష్టిలా మారిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. విపక్షాలు చేసే విమర్శలకు సరైన సమాధానం చెప్పడం లేదని, కౌంటర్ ఇవ్వడానికి కూడా సమయం లేదా? అని మంత్రులను చంద్రబాబు ప్రశ్నించడంతో ఇక వేగంగా రియాక్ట్ అవుతున్నారు అమాత్యులు. చంద్రబాబు హెచ్చరికలతో తమ పదవి ఎక్కడ ఊడుతుందేమోనన్న భయం వారిని పరుగులు పెట్టిస్తుంది.



జగన్ మీడియా సమావేశం తర్వాత... నిన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ అలా మీడియా సమావేశం పెట్టి ప్రభుత్వంపై విమర్శలు, హామీలు అమలు చేయలేదని, అధికారులకు, చంద్రబాబు వార్నింగ్ లు ఇస్తూ చేయడంపై వెనువెంటనే మంత్రులు రియాక్ట్ అయ్యారు. పోటీ పడి మరీ మీడియా సమావేశాలు పెట్టి జగన్ ను ఒక ఆటాడుకున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు దాదాపు మంత్రులు ఎక్కడ పర్యటనలో ఉన్నప్పటికీ కొందరు హడావిడిగా అమరావతికి వచ్చి పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశాలు పెడితే మరికొందరు తమ జిల్లా కేంద్రం నుంచి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్ విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఇందుకోసం జగన్ మీడియా సమావేశాన్ని మొత్తం చూసి అందులో ప్రభుత్వంపైనా, చంద్రబాబుపైన చేసిన విమర్శలను ఖండించార. అయితే మంత్రుల విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు వారికి ఉద్వాసన తప్పదని మాత్రం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో అత్యధిక మంది గెలవడంతో అందరికీ అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో భాగంగా ఖచ్చితంగా మంత్రివర్గ విస్తరణ జరుపుతారని అంటున్నారు. అయితే అది ఎప్పుడనేది ఇప్పుడు చెప్పలేకపోయినా రెండేళ్లు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేస్తారా? లేదా ముందుగానే చేపడతారా? అన్నది మాత్రం తెలియక అమాత్యులు ఆందోళనలోనే ఉన్నారు. మూడు రోజుల క్రితం చంద్రబాబు రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ ను కలిశారు. మర్యాదపూర్వకంగానే గవర్నర్ ను కలిసినా విస్తరణకు సంబంధించి అన్న అనుమానంతో మంత్రులు ఒకింత ఆందోళనకు గురయ్యారని తెలిసింది. కేవలం ప్రతిపక్ష పార్టీ విమర్శలకు మాత్రమే కౌంటర్ ఇచ్చి ఊరుకుంటే సరిపోదంటున్నారు. మంత్రుల బాధ్యతలు చాలా ఉన్నాయి. శాఖలపై పట్టు సంపాదించుకోవడంతో పాటు నిరంతరం ప్రజల్లో తిరుగుతూ తమ శాఖకు సంబంధించిన నిధులు ఏమేం ఖర్చు పెట్టారు? ప్రభుత్వం ఇప్పటి వరకూ ఏడాది కాలంలో చేసిన మంచిపనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కూడా వివరించాలి. దీనికి తోడు ముఖ్యమైనది కార్యర్తలను కలుపుకుని పోవడంతో పాటు తమకు కేటాయించిన జిల్లాల్లో కూటమి పార్టీలు, తెలుగుదేశం పార్టీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించడంలో విఫలమవ్వడాన్ని కూడా చంద్రబాబు పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశాలున్నాయంటున్నారు. అందుకే మంత్రులు కేవలం కౌంటర్లు మాత్రమే కాదు...కాంట్రావర్సీ లు లేకుండా చేయడంలో కూడా సత్తా చూపాల్సి ఉంటుందట.

# అడ్డంగా ఇరుక్కున్న వినుత

**తిరుపతి – సూర్య వాస్తవం**



సూక్ష్మ పరిమాణంలో ఉండే చీమ? భారీగా ఉండే ఏనుగు.. గొప్పగా ఆలోచించే మనిషి.. ఎవరిదైనా ప్రాణమే. ఆ ప్రాణానికి ప్రమాదం ఏర్పడితే.. ఆ ప్రాణం గాలిలో కలిసిపోతే తిరిగి తీసుకురావడం కష్టం. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితేనే చాలా బాధపడి పోతాం.. ప్రాణం పోయిందని కన్నీరు పెడతాం. మనుషులే కాదు జంతువులు కూడా తమ తోటి జంతువుల ప్రాణాలు పోతే కన్నీరు పెడతాయి. గుండెలు అవిసే విధంగా రోదిస్తుంటాయి. ప్రమాదవశాత్తు ప్రాణాలు పోతేనే అలా ఉంటే.. కావాలని ప్రాణాలు తీస్తే ఎలా ఉంటుంది.. ప్రాణాలు కోల్పోతున్న వ్యక్తి బాధ ఎలా ఉంటుంది? వ్యక్తిని కోల్పోయిన ఆ కుటుంబం బాధ ఎలా ఉంటుంది? అలాంటి కష్టం పగవారికి కూడా రావద్దు అనిపిస్తుంది కదా..నమ్మిన పాపానికి.. ఇన్ని సంవత్సరాలపాటు నమ్మిన బంటుగా ఉన్న పాపానికి రాయుడు అనే యువకుడిని శ్రీకాళహస్తి గ్లాస్ పార్టీ మాజీ ఇంచార్జ్ కోట వినూత, ఆమె భర్త, ఇంకా కొంతమంది వ్యక్తులు అంతం చేశారు.. అంతేకాదు అతడి మృతదేహాన్ని చెన్నైలో పడేశారు. అతడిని అంతం చేసిన తర్వాత ఏదో ఘనకార్యం చేసినట్టు వినూత, ఆమె భర్త భారీ వాహన శ్రేణి మధ్య సొంత ప్రాంతానికి వచ్చారు. శ్రీనివాస రాయుడు చేతి మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా చెన్నై పోలీసులు ఈ కేసును చేదించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో వినూత, ఆమె భర్త, ఇతర నిందితులు ఉన్నారు.

పోలీసుల విచారణలో వారు చెబుతున్న విషయాలు సంచలనంగా మారుతు న్నాయి. పనిలో పనిగా ఫ్యాన్ పార్టీ అనుకూల మీడియా మరిన్ని విషయాలను రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే శ్రీనివాసరాయుడు సోదరి, నానమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి కొన్ని కీలక విషయాలను రాబట్టింది.శ్రీనివాస రాయుడు సోదరిని పోలీసులు విచారణ నిమిత్తం పిలిచారు. పోలీసులు కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి ఆమె స్పష్టంగా సమాధానం చెప్పింది. తన వద్ద ఉన్న ఆధారాలు కూడా ఇచ్చింది. ఇదే క్రమంలో పోలీసుల విచారణ అనంతరం బయటికి వచ్చిన ఆమె విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది.." శ్రీనివాస రాయుడిని అంతం చేసిన తర్వాత ఈ విషయం మాకు తెలిసింది. మాకు కోట వినూత నుంచి ఫోన్ వచ్చింది. 30 లక్షలు ఇస్తాం.. ఈ విషయాన్ని మర్చిపో అన్నారు. దానికి మేము లొంగలేదు. మాకు డబ్బు అవసరం లేదు. వినుత చెప్పినట్టు మా సోదరుడు ప్రత్యర్థి పార్టీ వద్ద డబ్బు తీసుకొని ఉంటే.. అది ఎక్కడికి వెళ్ళింది? ఆ డబ్బు ఏ ఖాతాలో ఉంది? ఒకవేళ ఆయన డబ్బు ఇస్తే ఏ రూపంలో ఇచ్చాడు? ఇవన్నీ మాకు తెలియాలి. మా విషయంలో పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలి. న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. మేము న్యాయం కోసం మాత్రమే పోరాడుతున్నాం.. సోదరుడి ప్రాణానికి వెల కడుతున్నారు. ఇటువంటి పద్ధతి మంచిది కాదని" శ్రీనివాస రాయుడు సోదరి విలేకరులతో పేర్కొంది. ఇక దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. మొత్తంగా ఈ వ్యవహారంలో వినూత, ఆమె భర్త మరింత ఇరుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది.

### రసిక రాజకీయం

ఇక ఇప్పటి సోషల్ మీడియా కాలంలో కొంతమంది రాజకీయ నాయకులు తాము చేసిన తప్పుల వల్ల తమ పొలిటికల్ లైఫ్ నే కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇంచార్జి కోటా వినూత తన వద్ద గతంలో పనిచేసిన మాజీ డ్రైవర్ ను అంతం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినూత పేరును శ్రీనివాసరాయుడు తన చేతి మీద పచ్చబొట్టు పొడిగించుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆ పచ్చబొట్టు ఆధారంగానే చెన్నై పోలీసులు శ్రీనివాస రాయుడు కేసులో కీలక పురోగతి సాధించారు. ఆ తర్వాత ఏం జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కోటా వినూత చేసిన తప్పు వల్ల ఆమె రాజకీయ జీవితమే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

గతంలో వైసిపిలో ఉన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా దివ్వెల మాధురితో ఏర్పరచుకున్న సంబంధం వల్ల అభాసుపాలయ్యారు. ఆయన చేస్తున్న వ్యవహారాల వల్ల కుటుంబ సభ్యులు ఈసడించుకున్నారు. గొడవ కూడా పడ్డారు.. చివరికి దువ్వాడ శ్రీనివాస్ వారి మీద గొడవ కూడా దిగారు.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పంచాయతీ జరగడంతో శ్రీనివాస్ రాజకీయ జీవితం ఒక్కసారిగా మారిపోయింది. ఇక ఇటీవల ఆయన కొనసాగుతున్న పార్టీ నుంచి సస్పెండ్ కావలసి వచ్చింది. దీంతో ఇప్పుడు ఆయన రాజకీయ జీవితం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఎప్పుడు ఎటువంటి మలుపు తీసుకుంటుందో తెలియడం లేదు..కోటా వినూత, దువ్వాడ శ్రీనివాస్ మాత్రమే కాదు.. ఇంకా చాలామంది రాజకీయ నాయకులు ఇటువంటి తెరచాటు బంధాల వల్ల తమ పొలిటికల్ లైఫ్ కోల్పోయారు. నాయకుల తెరచాటు సంబంధాలను వారి దగ్గర వ్యక్తులే బయటికి తెలిసేలా చేయడం విశేషం. ఆ వ్యవహారాలను వివిధ రూపాలలో ప్రత్యర్థులు బయట పెట్టడం గమనార్హం.


### ఫైర్ బ్రాండ్ కు మరిన్ని కష్టాలు

కోట వినుత ఫైర్ బ్రాండ్ గా శ్రీకాళహస్తి ప్రజలకు సుపరిచితమే. పైగా వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నిరసన కార్యక్రమాలు అప్పట్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచాయి. ఏపీలో అప్పుడు మహిళలపై జరుగుతున్న అరాచకాలను నిరసిస్తూ వినూత వినూత్నమైన ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో మహిళా మంత్రిగా ఉన్న రోజా దిష్టిబొమ్మను ఏర్పాటు చేసి చెప్పుతో కొట్టారు. కొట్టడమే కాదు, తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఒక మహిళ మంత్రివై ఉండి.. ఆడవాళ్ళపై దారుణాలు జరుగుతుంటే మాట్లాడకుండా ఉంటావా అంటూ వినూత ప్రశ్నించారు.తన డ్రైవర్ శ్రీనివాసరాయుడు కేసులో వినూత, ఆమె భర్త చంద్రబాబు జైలు పాలు కావడంతో.. వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. గతంలో రోజాను విమర్శిస్తూ వినూత చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.

" నాడు రోజాను విమర్శించింది. అడ్డగోలుగా మాట్లాడింది. ఇప్పుడు తను చేసింది ఏంటి? గొప్ప పని కాదు కదా.. ఏకంగా ఒక యువకుడి ఉసురు తీసుకుంది. తన దగ్గర పనిచేసిన వాడి ప్రాణాలను తీసింది. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదు కదా. ఇలాంటి వ్యవహారాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించకూడదు. ఒకరి మీద విమర్శలు చేసేవారు.. ముందుగా తమ స్థాయి ఏమిటో తెలుసు కోవాలి. ఇప్పుడు వినూతకు తన స్థాయి ఏమిటో తెలిసి వచ్చింది. అయినప్పటికీ ఉపయోగం లేదు. ఎందుకంటే ఆమె రాజకీయ జీవితం దాదాపుగా ముగిసిపోయినట్టేనని" వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు..ఈ కేసులో పోలీసులు అత్యంత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస రాయుడు కాల్ డాటా పరిశీలిస్తున్నారు. అతని బ్యాంకు వివరాలను కూడా గమనిస్తున్నారు. ఈ కేసులో ఇంకా కొన్ని కీలక విషయాలను రాబట్టాల్సి ఉన్నందున.. ఇప్పుడే తాము ఏమి చెప్పలేమని పోలీసులు అంటున్నారు. కాకపోతే మీడియా లీకుల వల్ల ఈ కేసులో ఉన్న సంచలన విషయాలు రోజుకొకటి చొప్పున బయటికి విడుదలవుతున్నాయి. దీంతో ఈ కేసులో ఇంకా ఏవో విషయాలు ఉన్నాయని ఆసక్తి ప్రజలలో ఏర్పడుతోంది.

## హంద్రీ నీవా విషయంలో
# సొమ్ము కాంగ్రెస్‌ది, సోకు టిడిపిది

- పోలవరం, బనకచర్ల రాష్ట్రానికి గుదిబండ
- కృష్ణా నదిపై తెలంగాణా అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 18:** హంద్రీ నీవా విషయంలో సొమ్మొకరిది సోకొకరిది అన్నట్లుందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. సొమ్ము కాంగ్రెస్‌ది, సోకు టిడిపిది అన్నారు. ఎద్దు ఈద్చుగా పిడుదు వగిరిచ్చినట్లు ఉంది అన్నారు. 1983 లో స్వర్గీయ ఎన్టీఆర్ అనంతపురం జిల్లా , ఓడి చెరువు వద్ద ఈ ప్రాజెక్టుకు శంకు స్థాపన చేశారు. కానీ 2004 వరకు 21 సంవత్సరాలలో ఈ ప్రాజెక్టు పై ఖర్చు చేసింది కేవలం రూ 13.75 కోట్లు మాత్రమే. 2004 లో కాంగ్రెస్ అధికారం లోకి వస్తానే ఈ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి.

ఈ ప్రాజెక్టును జల యజ్ఞం క్రింద చేర్చడం జరిగింది. 2005 లో ఉరవకొండ వద్ద కాంగ్రెస్ ముఖ్య మంత్రి రాజ శేఖర్ రెడ్డి

శంకు స్థాపన చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 834 అడుగుల ఎత్తు నుండి రోజుకు 3850 క్యూసెక్కుల నీటిని 120 రోజుల పాటు తీసుకొని 40 టి ఎం సి లతో రాయలసీమలో 6.02 లక్షల ఎకరాల కు సాగు నీరు,33 లక్షల మంది కి త్రాగు నీరు అందించే విధంగా రూప కల్పన జరిగింది. కాంగ్రెస్ హయాం లో రూ 6948 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.తొలి దశ పూర్తి అయింది.రెండవ దశ లో 80 శాతం పనులు పూర్తి అయ్యాయి.2012 లోనే అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్ లో నీళ్లు నింపి జాతికి అంకితం చేయడం జరిగింది. 2012- 13 లో 1.1టీ. ఏం.సి , 2013- 24 లో 10.12 టీ. ఏం.సి లు విడుదల చేయడం జరిగింది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 795 అడుగుల నుంచి హంద్రీ నీవా ప్రధాన కాలువ లోకి నీళ్లు ఎత్తి పోసే విధంగా 2007 ఆగష్టు 31 న ముచ్చుమర్రి ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసి 90 శాతం పనులు కాంగ్రెస్ పాలన లో పూర్తి చేయడ జరిగింది. కూటమి పాలనలో కొంచెం విస్తరణ,లైనింగ్ పనులు మాత్రమే జరిగాయి,జరుగు చున్నాయి. తానే శంకు స్థాపన చేసినట్లు,పూర్తి చేసి నట్లు, ప్రారంభం చేసినట్లు చంద్ర బాబు డబ్బా కొట్టుకోవడం హాస్యా స్పదమని తులసి రెడ్డి అన్నారు.

**పోలవరం, బనకచర్ల**

ఈ ప్రాజెక్టు ఆచరణ సాధ్యం కాదని, రాష్ట్రానికి గుదిబండ గా తయారై రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేస్తుందని ,ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణా అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి**

పోలవరం బనక చర్ల ప్రాజెక్టును తెలంగాణా ప్రభుత్వం ఒప్పుకుంటే కృష్ణా ,గోదావరి నదులపై తెలంగాణా ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అడ్డు చెప్పదని ముఖ్య మంత్రి చంద్ర బాబు చెప్పడం సమంజసం కాదు.ఇది దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కు అశని పాతమవుతుంది.కృష్ణా నది పై తెలంగాణా ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా,కేంద్ర జల శక్తి కమీషన్,కృష్ణా నదీ యాజమాన్య బోర్డు,అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా 90 టి ఎం సి ల సామర్థ్యంతో పాలమూరు రంగా రెడ్డి,30 టాంక్ ల సామర్థ్యంతో డిండి ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తోంది.విభజన చట్టం లో పై ప్రాజెక్టుల ప్రస్తావనే లేదు.పై ప్రాజెక్టులు పూర్తిఅయితే క్రింది రాష్ట్ర మైన ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, వెలిగొండ, ఎస్ ఆర్ బీ సీ ,సాగర్,కృష్ణా డెల్టాకు నీరు అందక రాయల సీమ తో పాటు రాష్ట్రం ఎడారి అవుతుంది. కాబట్టి పోలవరం బనక చర్ల ప్రాజెక్టు కోసం ఆంధ్ర ప్రదేశ్ ను తెలంగాణాకు తాకట్టు పెట్టవద్దని,రాష్ట్రాన్ని ఎడారి చేయవద్దని తులసి రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృ వియోగం

## - ఎమ్మెల్యేను పరామర్శించి సంతాపం వ్యక్తం చేసిన కుప్పం టిడిపి శ్రేణులు







**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 18 :** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృ మూర్తి లక్ష్మి భారతి శుక్రవారం మర ణించారు. దీంతో కుప్పం తెలుగు దేశం పార్టీ శ్రేణులు ఆయన స్వగ్రామం పులివర్తివారిపల్లి వెళ్లి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృమూర్తి మృతి పట్ల వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చంద్రగిరి ఎమ్మె ల్యే పులివర్తి నానిని ఫోన్ ద్వారా పరామర్శించి ఆయన మాతృమూర్తి మృతి పట్ల తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్లు జిమ్ దాము, సురేష్, నేతలు ఉమాపతి, నరేష్ పాల్గొన్నారు.

## పంటలను రైతు సంస్థలకే అమ్మాలి



**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 18 :** రైతుల పండించిన పంటలను సంఘమే కొనుగోలు చేస్తుందని సిబిబిఓ కోర్డినేటర్ భాస్కర్ బాబు పేర్కొన్నారు. కూడేరు మండలం కలగల్లు గ్రామం లో శ్రమజీవన రైతుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ 4వ వార్షిక మహాసభను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ముఖ్య అతిథులుగా సిబిబిఓ కోర్డినేటర్ భాస్కర్ బాబు ఎఫ్‌పిఒ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖాన్ హాజరయ్యారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతంతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 సంవత్సరం ఆర్థిక లావాదేవీలు సభ్యులకు వివరించారు. 2025-26 సంవత్సరం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను తెలియజేశారు. అలాగే ఆడిటర్ నియకము పై చర్చించారు.అనంతరం సంఘం నూతన పాలక వర్గం ను ఎన్నుకున్నారు. అనంత సమృద్ధి ప్రొడక్ట్స్ గురించి చర్చించారు. ప్రతి వాటాదారుడు సంవత్సరంలో ఒక్కసారైనా వ్యాపార కార్యకలాపాలు తప్పనిసరిగా జరపాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎం.మునెమ్మ ఎంటిఎల్ శివమ్మ ఎఫ్‌పిఒ మేనేజర్ ప్రతాప్ ఎఫ్ పిఒ అకౌంట్స్ మేనేజర్ కళ్యాణ్ 192 మంది వాటాదారులు 12 మంది బిఓడి సభ్యులు ఎస్‌టిఓలు ప్రజలు హాజరయ్యారు.




## విద్యార్థులకు విద్య పరికరాలు అందజేత



**పెళ్లకూరు - సూర్యా వాస్తవం, జూలై 18:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల పరిధి లోని పోలిరెడ్డి పాలెం ప్రాథమిక పాఠశాల లో శుక్రవారం సూళ్లూ రుపేటలోని లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో 60 మంది విద్యా ర్థులకు నోట్ బుక్స్ బిస్కెట్స్ లయన్స్ క్లబ్ సహకారంతో అందించారు. లయన్స్ క్లబ్ సభ్యురాలు హేమలత మనవరాలు సంజన పుట్టినరోజు సందర్భంగా ప్లేట్లు గ్లాసులు కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మా లయన్స్ క్లబ్ వారు పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్య పరంగా విద్య పరికరాలను అందించడం జరుగుతుంది. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏటా పేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత విద్య పరికరాలను అందిస్తూ ఉన్నామని ఇలాంటి కార్యక్రమాలు మా చేతనైనంతవరకు మేము చేస్తూ ఉన్నామంటూ లైన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా లైన్స్ క్లబ్ రీజినల్ సెక్రటరీ ఆదిశేషారెడ్డి, క్లబ్ ప్రెసిడెంట్ లలిత, సెక్రెటరీ అరుణకుమారి, లైన్స్ క్లబ్ సభ్యులు అప్పారావు, రాధాకృష్ణరావు, హేమలత, అంకులరావు, సంగీత స్కూల్ టీచర్స్ ప్రసన్న,రమ,తదితరులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌తో
# పట్టణ ప్రజల భద్రతకు భరోసా

- వాహనాల తనిఖీలలో పాల్గొన్న సిఐ గంటా సుబ్బారావు




**ఆదోని - సూర్య వాస్తవం, జూలై 18 :** ఆదోని పట్టణంలో శుక్రవారం నాడు సీఐ గంటా సుబ్బారావు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో వాహనాల తనిఖీలలో ఆయన పాల్గొన్నారు. రికార్డ్స్ లేని వాహనాలు తనిఖీ చేశారు. అంతేకాకుండా... సరైన రికార్డ్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.... ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతపై దృష్టి సారించాలని మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఆదోని పట్టణంలో వాహనాల రాకపోకలు సులువుగా సాగేలా చర్యలు చేపట్టారు.

## వైయస్సార్సీపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శిగా జాఫర్ అలీ ఖాన్




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 18:** వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన మయాన జాఫర్ అలీ ఖాన్ నియ మితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ఆవిర్భావం నుండి జాఫర్ అలీ ఖాన్ వైయస్ఆర్సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. రాయ చోటి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడుగా కూడా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం జాఫర్ అలీ ఖాన్ ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియ మించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తన సేవలను గుర్తించడం, పదవిని కట్టబెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి కృషిచేసిన రాజంపేట పార్లమెంటు సభ్యుడు సభ్యుడు మిథున్ రెడ్డి మిధున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, వైయస్సార్ సిపి జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు తన వంతు కృషి సంపుతాను అంటూ చెప్పారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన మార్కెట్ కమిటీ చైర్మన్



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 18:** రాష్ట్ర రావాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వగ్రామం నందు నూతనంగా రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన అనంపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల మధ్య మంత్రికి శాలువా వేసి, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మల్టిపుల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ కు శాలువా తప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ క నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అనంతపురం నగరాభివృద్ధే లక్ష్యం

- 'సుపరిపాలన తొలి అడుగు'లో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి
- 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాలలో 'సుపరిపాలన తొలి అడుగు'
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నగరాభివృద్ధి జరుగుతోంది
- ఆర్థికంగా కష్టాలు ఉన్న అభివృద్ధి ఆపలేదు: మంత్రి నారాయణ
- ఏడాదిలోని అభివృద్ధి అంటే ఏంటో నగర ప్రజలకు చూపించాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 18:** ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఒకటవ వార్డు ఎర్రనేల కొట్టాల కాలనీలో సూపర్ పాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు గురించి ప్రజల స్పందన అడిగి తెలుసుకున్నారు. అనంతపురం నగరాన్ని అన్ని విధాల తీర్చి దిద్దుటకు కృషి చేస్తామని ముఖ్యంగా డ్రైనేజీ పనులు, రోడ్లు మంచినీటి సదుపాయాలు తదితర మౌలిక వసతుల కల్పన ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహిళకు చేయూత, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం రాష్ట్రంలోని ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పోలవరం, పోర్టులు,అమరావతి, స్టీల్ ప్రాజెక్టు ఫిషింగ్ హార్బర్లు నిర్మాణంతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి మంత్రి లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ .15000, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు , అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగ నియామకాలు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మరోవైపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సహకారాలతో అనంతపురం నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో నాయకులు నిర్లక్ష్యం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఏడాది కాలంలో ఈ పరిస్థితుల నుంచి కొంత బయటపడుతున్నామని వివరించారు. ఎన్నికలకు ముందు నగర ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అయితే ప్రాధాన్యత వారిగా ఆ పనులు జరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే ఏడాది కాలంలోనే నగర ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో చూపించమన్నారు. రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## ఆటపాటల విద్య కోసం పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించండి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండసాని రజిత పిలుపు



**కొత్తచెరువు -సూర్య వాస్తవం, జూలై 18:** చిన్నారులకు ఆటపాటల విద్య కేవలం అంగన్వాడీ కేంద్రాల్లోనే సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కొండసాని రజిత అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను ఆమె పిలుపునిచ్చారు. కొత్తచెరువు మండలం లోచర్ల సెక్టార్ పరిధిలోని ఎర్రబల్లి అంగన్వాడీ - 1, 2 కేంద్రాల్లో అంగన్వాడీ వర్కర్లు నిర్మల, సుబ్బమ్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్ వైజర్ కొండసాని రజిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆమె అక్షరాలు దిద్దించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించినా.. పిల్లలకు ఒత్తిడికి గురి చేయడం దారుణమన్నారు. దీంతో చిన్నారులు బాల్యం నుంచే మానసిక, శారీరక హింసకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసారు. కొందరు ఒత్తిడి తట్టుకోలేక పాఠశాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి తమ పిల్లలకు రాకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే ఒత్తిడి లేని విద్య కోసం అంగన్వాడీ కేంద్రాలలో చేయించాలని ఆమె కోరారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఆటపాటలు కూడా కరువయ్యాయని, అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. వాటితో పాటు మంచి పౌష్టికాహారం కూడా అందిస్తారని, పిల్లల ఎదుగుదలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## చెంగాలమ్మ తల్లిని దర్శించుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే దంపతులు



**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, జూలై 18:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలో వెలసి ఉన్న చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని బుధవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు శాఖాంబరి అలంకారం తో దర్శనమిచ్చారు ఆలయంలో కూరగాయలతో, పండ్లతో పందిళ్లు వేసి అందంగా అలంకరించిన విధానాన్ని చూసి ఎమ్మెల్యే దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. వీరితోపాటు సూళ్లూరుపేట టిడిపి నాయకులు ఉన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ మృతి





**మదనపల్లె- సూర్య వాస్తవం, జూలై 18:** గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలి మృత్యువాత పడ్డ విషాదకర సంఘటన శుక్రవారం వేకువ జామున మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టు టౌన్ పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెలోని కనకదాసనగర్ కు చెందిన గోళ్ళ వెంకటరమణ నాయుడు (56) స్థానిక టమోటా మార్కెట్ యార్డు లో కూలి పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. అర్ధరాత్రి 12 వరకు టమోటా క్రీట్లను లారీలకు లోడ్ చేసి నడుచుకుంటూ ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని అనపగుట్టకు వెళ్లేదారిలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వెంకట్రమణ నాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కళావతి కుమార్తె ప్రసన్నలక్ష్మి, కుమారులు సాయికుమార్, మనికంఠ లు ఉన్నారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్మార్ట్ మీటర్లు పేదల రక్తం పీల్చే మిషనరీలు

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 18:** ప్రభుత్వం బలవంతంగా ప్రజల ఇండ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్స్ బిగిస్తోందని, అవి స్మార్ట్ మీటర్లు కాదని పేదల స్వేద రక్తాలను పీల్చి పెట్టుబడిదారులుకిచ్చే మిషనరీలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు విమర్శించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన స్మార్ట్ మీటర్ల ను వ్యతిరేకించే క్యుఆర్ స్కాన్ కోడ్ పత్రాలను ప్రజల తో కలసి ఆవిష్కరణ చేశారు.

అనంతరం సిపిఎం కార్యకర్తలు బోస్ నగర్ సందీప్ నగర్ దూదేకుల పల్లి ప్రాంతాలలో ప్రతి ఇంటికి తిరిగి విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన పేదల మీద ప్రభుత్వం నడ్డి విరిచే భారాలు, నష్టాలను ప్రజనీకానికి వివరించారు. ప్రతిపక్షనేతగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగల కొట్టండని చెప్పి అధికారం లోకి వచ్చాక వైసీపీ కి మిన్నగా వేగంగా స్మార్ట్ మీటర్ల ద్వారా కార్పొరేట్లకు పేదల శ్రమను దోచి పెడుతున్నడానికి అత్యుత్సాహం కనబరుస్తాడని పేర్కొన్నారు. ప్రజల మీద విద్యుత్ భారాలు వేస్తే 1999లో భషీరా బాగ్ ఉద్యమంతో టీడీపికి 10 సంవత్సరాల పైగా అధికారాన్ని ప్రజలు దూరం చేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ద్వారా సంపద ఒకరి దగ్గరే కేంద్రకరింపబడి ఆర్థిక అసమానతలు పెరిగి ఆర్థిక సంక్షో బానికి కారణమవుతాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లతో మధ్యలో విద్యుత్ ఆగిపోతే చిన్నపిల్లలు బాలింతలు వృద్దులతో మహిళలు తీవ్ర ఇక్కట్లకు లోనవుతారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల వినియోగం తో రైతులు, దళితులతో కొన్ని వృత్తుల వారికి ఫ్రీ కరెంట్ కోల్పోతారని ఆవేదన చెందారు. ప్రజాగ్రహం మొదలు కాకముందే ప్రభు త్వం స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాధవయ్య ఈశ్వరయ్య, రమణయ్య, చెన్నయ్య, కదిరయ్య, గంగులయ్య ఓబులయ్య, కిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- దేశభక్తికి, సేవాభావానికి ప్రతీక స్కౌట్స్
- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం వెల్లడి




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 18:** పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. రాయచోటి గాలివీడు రోడ్డు మార్గానగల అర్చన కళాశాలలో శుక్రవారం ఉదయం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లోని 250 మంది యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడు తుందన్నారు. పి ఎం శ్రీ పాఠశాలల నుండి అవగాహన సమావేశానికి గైర్హాజరు అయినవారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్కౌట్‌లో ప్రవేశం పొందడం వల్ల విద్యార్థులకు దేహ దారుఢ్యం తో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు గౌరవ వేతనం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం అర్చన కళాశాల కరస్పాం డెంట్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వలన నిజాయితీ, సుగుణ శీలత, ధైర్య సాహసాలు, సేవాగుణం లాంటి ఉత్తమ పౌరసత్వ లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతా యన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు.

అనంతరం స్కౌట్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. స్కౌట్ నందు ప్రవేశం పొందిన విద్యార్థుల, యూనిట్ లీడర్ల వివరా లను జూలై 31వ తేదీ లోపల జిల్లా స్కౌట్ కార్యాలయానికి అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గ నైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ మహమ్మద్ ఖాన్, సుజాత, స్కౌట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టన్స్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.



# అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ని గుర్తించాలి

### - మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జూలై 18:** అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్ ని గుర్తించాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని ఎన్ఐసి భవనంలో నగర పాలక సంస్థ, అహుడా, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, అహుడా చైర్మన్ టి.సి.వరుణ్ లతో కలిసి మంత్రి డా.పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి డా.పి. నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అహుడా పరిధిలో అవసరమైన ల్యాండ్ బ్యాంక్ ని ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. ఎంఐజీ లేఔట్స్ ను అభివృద్ధి చేసి ప్రజలకు ప్లాట్లను కేటాయించాలన్నారు. మంచి భూములను నగరానికి దూరంగా కాకుండా దగ్గర్లో ఉండేవి చూడాలన్నారు. ఆయా లేఔట్స్‌లో రోడ్లను, డ్రైనేజీలను నిర్మించాలన్నారు. చిన్న మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. కళ్యాణదుర్గం పరిధిలో ఎస్సీ కాలనీల లో అభివృద్ధి పనుల కోసం 25 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో సచివాలయ ఉద్యోగులకు సంబంధించి గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కి ప్రమోషన్లను ఇవ్వడం జరుగుతుందని, వారిని డిప్యుటేషన్ ద్వారా నగరపాలక సంస్థలో నియమించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ అహుడా పరిధిలో అవసరమైన మరింత ల్యాండ్ బ్యాంక్ ను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో కాపు, బీసీ భవన్ ల కోసం భూకేటాయింపు చేపడతామన్నారు. శనివారం అహుడ పరిధిలో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కాపు భవన్, బిసి భవన్, ఇండోర్ స్టేడియంలో మరమ్మత్తులు, మున్సిపల్ పార్కులలో నూతన జిమ్ పరికరాలు మరియు ఉన్నవాటికి మరమత్తులు, నగరంలో పెరుగుతున్న జనాభా కోసం సిటీ సర్వీస్ బస్సులు ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఒక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. అర్బన్ నియోజకవర్గంలోని (133 ఎస్ ఎల్ ఎఫ్) మహిళా సంఘాల పక్కా భవనాలకు అవస రమైన స్థలం కేటాయించాలని కోరారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ...... తమ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ఎస్సీ కాలనీలలో అభివృద్ధి పనుల కోసం 50 లక్షల రూపాయలను మంజూరు చేయాలని, వాల్మీకి భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అహుడా చైర్మన్ టి.సి.వరుణ్ మాట్లాడుతూ అహుడా పరిధిలోని ఎంఐజీ లేఔట్స్ లలో అభివృద్ధి పనులు చేపట్టాలని, మడకశిర ఎంఐజీ లేఔట్ ని అభివృద్ధి చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, నగరపాలక సంస్థ ఈఈ షాకిర్, టిడ్కో ఈఈ సుధారాణి పాల్గొన్నారు.

# 'సుపరిపాలనలో తొలి అడుగు' వేగం పుంజుకోవాలి



**రాప్తాడు - సూర్య వాస్తవం:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం వేగం పుంజుకోవాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. క్లస్టర్ ఇన్చార్జిలు మాట్లాడుతూ ప్రస్తుతం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఎంతవరకు వచ్చింది అనే వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా వివరించారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు చాలా చోట్ల తక్కువగా నమోదు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ బూత్ ఇన్చార్జిలు ఏం చేస్తున్నారని ఆరా తీశారు. ఐదేళ్ల పాటు వైసీపీని ఎదుర్కొని మనం అధికారంలోకి వచ్చామన్నారు. ఇప్పుడు ఆర్థికంగా ఎంతో లోటు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోనే అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో 2014 నుంచి 2019 వరకు మనం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించ లేకపోయమన్నారు. దీని కారణంగానే 2019లో ఓటమిని చవి చూసామన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండకుండా తొలి ఏడాదిలోనే మనం చేసిన అభివృద్ధి గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ అధిష్టానం ఆదేశించింద న్నారు. పార్టీ అధిష్టానం ఆదేశం ఏదైనా సరే మనం పాటించి తీరాలన్నారు.ఇక్కడ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా మనం ప్రజల్లోకి వెళ్లేందుకు ఒక మంచి అవకాశం ఉందన్నారు. ఇంకా ప్రజలకు ఏమైనా చేయాలన్నది తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వానికి కూడా మనం అవసరమైనవి అడిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని నిర్ణీత గడువు లోపు టార్గెట్ చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే.ఎస్.ఎస్, పోలింగ్ బూత్ యూనిట్ క్లస్టర్ ఇన్చార్జిలు మండల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్









**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 18**
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు ఎంపవరింగ్ మైండ్స్ త్రు లీడింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఈ శేషు పీహెచ్‌డీ ఎం.చక్రధర్ (అమెరికా ) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో దూసుకెళ్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. ఏఐ విభాగంలో జరుగుతున్న తాజా పరిశోధనలు, మిషన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ పద్ధతుల వాడుకపై ఆసక్తికరమైన విజ్ఞానాన్ని పంచారు. డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌లో చిత్ర విశ్లేషణ, ఫీచర్ ఎక్స్‌ట్రాక్షన్, ఫిల్టరింగ్ టెక్నిక్స్ వంటి అంశాలపై ప్రాక్టికల్ ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే కంప్యూటర్ విజన్ రంగంలో ఆబ్జెక్ట్ డిటెక్షన్, ఫేస్ రికగ్నిషన్, ట్రాకింగ్ మెకానిజమ్స్ వంటి సాంకేతికతను విద్యార్థులతో పంచుకున్నారు.

విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు నిపుణులు విస్తృతంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులలో పరిశోధనాపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడిందని ఉపాధ్యాయ, విద్యార్థి వర్గం అభిప్రాయపడింది. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు పరిశోధనా దృక్పథంతో కొత్త ఆవిష్క రణల వైపు అడుగులు వేయాలని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. "ప్రపంచంలో ప్రతిరోజూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు అప్‌డేట్ అవ్వాలని, సరికొత్త టెక్నాలజీ అంశాలపై ఫోకస్ చేసి వర్క్‌షాపులు, సెమినార్లు తరచూ నిర్వహించడం ద్వారా వారికి నైపుణ్యం కల్పించాలన్నదే మా ధ్యేయం ," అని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ నిర్వహణలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఆహ్లాదంగా స్వీకరించారు.


# వీరబల్లి అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

### - మూడు ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం

**వీరబల్లి - సూర్య వాస్తవం, జూలై 18**
కడప జిల్లా సానిపాయ సమీపంలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో ఒక ఎర్రచందనం స్మగ్లర్ ను అరెస్టు చేయడంతో పాటు మూడు ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీ జి. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఎస్ఐ పీ. నరేష్ టీమ్ స్థానిక ఎఫ్ బీఓ అనిల్ కుమార్ తో కలసి వీరబల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేస్తుండగా అయ్యలవారి పల్లి వద్ద ఒక వ్యక్తి మోటారు సైకిల్ తో నిలబడి ఉన్నాడు. అతన్ని సమీపించడంతో అతను మోటారు సైకిల్ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు అతన్ని పట్టుకుని, అతని వద్ద నుంచి మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. అతనిని తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతనిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత చమర్తికి లేదు

### - వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు క్రిష్ణారెడ్డి



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 18:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గురించి మాట్లాడే స్థాయి టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజుకు లేదని వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు సిగం క్రిష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రమైన సిద్దవటంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరోనా కాలంలో సంక్షేమ పథకాలు అమలు పరిచిన దేశంలోని ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డినే అన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అములు చేస్తామని అపద్దపు హామీలు చెప్పి ఇంత వరకు అమలు పరచలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులుకు ఫీజు రీయంబర్స్మెంటు వేయలేదన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను డబ్బులు కట్టనిదే కళాశాలలకు రావద్దుంటున్నార న్నారు. రైతులకు సుఖీభవ పథకం కింద రూ.20వేలు వేస్తానన్నారు. ఇప్పటి వరకు ఒక పైసా కూడా వేయలేదని విమర్శించారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేస్తామని ఆశచూపారని, ఇప్పటి వరకు ఆఊసేలేదని అన్నారు. బీసీల వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలికి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.




# మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ సిబ్బంది రిలే దీక్షలకు వైసీపీ మద్దతు

**గుత్తి- సూర్యవాస్తవం, జూలై 18:** గుత్తి టౌన్ మున్సిపల్ కార్మికులు ఇంజనీరింగ్ సిబ్బంది గత ఆరు రోజులుగా చేస్తున్న రిలేదీక్షలకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రక టించిన గుత్తి వైఎస్ఆర్సిపి పార్టీ, కార్మికులు చేస్తున్న దీక్షకు పూర్తి మద్దతు తెలిపే వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాల ని జీవో నంబర్ 36న వెంటనే అ మలు చేసి కార్మికులకు కూడా సం క్షేమ పథకాలు ఇవ్వాలని ప్రభు త్వం చిత్తశుద్ధితో ఆలోచించే కా ర్మికులకు పర్మినెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇ వ్వాలని డిమాండ్ చేయడం జరి గింది గత ప్రభుత్వం కార్మికులకి అందరికీ అందించిన సంక్షేమ పథ కాలు ఇప్పుడు నిలిపేయడం సరి కాదని వారికి వెంటనే ప్రభుత్వ ప థకాలలో లబ్ధి చేకూరాలని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో పాల్గొన్న గుత్తి ము న్సిపల్ చైర్ పర్సన్ వన్నూరు బి గుత్తి పట్టణ మండల కన్వీనర్లు క ప్పలబండ మధుసూదన్ రెడ్డి గంగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి గు రుప్రసాద్ యాదవ్, రంగస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, ఫారూఖ్, కె.వి.రమణ,నరేష్ బేతపల్లి సర్పంచ్ చిన్న ఆంజనేయులు జిల్లా నాయకుల రమేష్ రెడ్డి జిప్ రమణ, మున్సిపల్ వింగ్ మహమ్మద్ షఫీ,ఎస్సీ సెల్ నాయ కులు మల్లికార్జున, హమ్మలి,రా మంజి,పోలీస్ అబ్దుల్ వెల్డింగ్ రూఫ్ ఉబ్బిచర్ల రామ్ రంగారెడ్డి, బేతపల్లి చిన్న పుల్లప్ప,జక్కల చె రువు రాజన్న,బేతపల్లి అంజినే యులు(అంజి) జక్కల చెరువు రంగస్వామి,అరుణ్ కుమార్,పె ద్దా పులప్ప,ఉటకల్లు సుధాకర్ బాసినేపల్లి తిమ్మారెడ్డి 25వ వార్డు హరిబాబు, పల్లె బ్రహ్మానందరెడ్డి, బిందె శ్రీనివాసులు యాదవ్ లాల్, మహమ్మద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజనులకు మెరుగైన స్థితిగతులకు కృషి

### - గవర్నర్‌కు నివేదిక సమర్పించిన కమిషన్ చైర్మన్



**అమరావతి - సూర్యవాస్తవం, జూలై 18:** గిరిజనులకు మెరుగైన విద్య, వైద్యం, జీవన స్థితిగతులు కల్పించేందుకు ఎస్‌టి కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేసిందని కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. కమిషన్ వార్షిక ప్రగతి నివేదికను శుక్రవారం గవర్నర్‌కు సమర్పించిన సందర్భంగా, కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి చేసిన సూచనలతోపాటు గిరిజనుల స్థితిగతులు, చేపట్టాల్సిన చర్యలు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించినట్లు, ఆయా సందర్భాలలో కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలు, వినతి పత్రాల రూపంలో గిరిజనులు పేర్కొన్న అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు.క్షేత్ర స్థాయి పర్యటనల్లో వివిధ జిల్లాల కలెక్టర్లతో సమావేశమై, ఆయా జిల్లాల్లో గిరిజనుల స్థితిగతులను సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలు సూచించినట్లు పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుతూ, వారి సహజ జీవన శైలిలో జీవించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కమిషన్ కార్యదర్శి కె.రామశేషు, డైరెక్టర్ కట్ట సాంబయ్య, సూపరింటెండెంట్ బి.సుశీల్ కుమార్ ఉన్నారు.

# తిరుపతి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



**తిరుపతి-సూర్య వాస్తవం, జూలై 18:**
గుంతకల్ డివిజన్ రైల్వే భద్రతదళంకు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఆకాష్ కుమార్ జైస్వాల్ తిరుపతి రైల్వే స్టేషన్ కు విచ్చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని, ఆర్పిఎఫ్ ఆఫీసు కార్యకలాపాలను తనిఖీలు చేశారు. తదుపరి ఆర్పిఎఫ్ ఆఫీసర్స్ మరియు సిబ్బందితో రెండు రోజుల క్రితం రైల్వే కోచ్‌లో జరిగిన అగ్నిప్రమాదం గురించి చర్చించారు. అగ్నిప్రమాద సమయంలో సిబ్బంది చూపిన సమస్ఫూర్తికి, అక్కడ ఉన్న ప్రజలకు ఎటువంటి ఆపద కానీయకుండా చూసుకున్నందుకు వారి కృషిని కొనియాడారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్కరు కలిసిమెలిసి పనిచేయాలని వారి డ్యూటీలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆఫ్ ఆర్పిఎఫ్, రేణిగుంట,సందీప్ కుమార్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఆర్పిఎఫ్, తిరుపతి, శ్రీ వెంకటేశ్వర్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ ఆర్పిఎఫ్ రేణిగుంట ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# 9వ రోజు సుపరిపాలనలో కదిరి శాసనసభ్యులు



**కదిరి రూరల్-సూర్య వాస్తవం, జూలై 18:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది సందర్భంగా అభివృద్ధి ఏమిటో కదిరి నియోజకవర్గం ప్రజలకు చూపించాం అంటూ కదిరి నియోజకవర్గం శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు శుక్రవారం నియోజకవర్గంలో కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని వీధి వీధి ,వాడ వాడ తిరుగుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా పంచిపెట్టారు,రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అభివృద్ధి ,సంక్షేమ పథకాలలో వెనకడుగు వేయకుండా సుపరిపాలనలో తొలి అడుగులు వేసుకుంటూ అభివృద్ధి బాటలో పయనిస్తున్న కార్యక్రమానికి కందికుంట వెంకటప్రసాద్ అధ్యక్షతన ఊరు ,వాడ అందరూ నడుము బిగించి పూలమాలలతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు, స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల ను సమస్యలు పరిష్కారం గురించి తెలుసుకుని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు, మంచినీటి సదుపాయాలను, డ్రైనేజీ వ్యవస్థ గురించి, రోడ్లు, మౌలిక సదుపాయాల గురించి దృష్టి సాగించిన ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేస్తూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు, మహిళలు, చేయూత, యువతకు ఉపాధి, ఉద్యోగ



అవకాశాలు మరింత దృష్టి సాగిస్తూ ప్రభుత్వం ముందు సాగిపోతున్నారు ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ బహావుద్దీన్ ,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రాజశేఖర్ చారి, కౌన్సిలర్లు ఓం ప్రకాష్, తెలుగుదేశం పార్టీ నాయకులు గంగులప్ప , మహిళ నాయకురాలు ప్రేమలత , సుధాకర్, యూనిస్, రమణ, ఇంతియాజ్, విశ్వనాథ్, అన్వర్ భాష, ఈశ్వర, మోహన, శీన, షానవాజ్, చలపతి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మాకూ వితంతు పింఛన్ కావాలి

**- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణితో మొరపెట్టుకున్న ఓ భర్త**

**అనంతపురం - సూర్య వాస్తవం , జూలై 18:**
భర్త చనిపోతే భార్యకు పింఛను ఇస్తే సరిపోదు..భార్య చనిపోయిన భర్తలకూ వితంతు పింఛన్ కావాలని ఓ బాధిత భర్త మొరపెట్టుకున్నాడు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తన నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఇటువంటి ప్రశ్న ఎదురవుతుందని ఆమె ఊహించి ఉండరు. భార్య చనిపోగా..ఒంటరిగా మిగిలిన ఓ వితంతు భర్త ఎమ్మెల్యే వద్దకు వచ్చి కన్నీళ్లు పెట్టుకున్నాడు.



తనకొచ్చిన కష్టం గురించి ఆమెతో చెప్పుకొని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. భర్త చనిపోతే భార్యకు పింఛను ఇస్తున్న ప్రభుత్వానికి భార్య లేని. భర్తల సమస్య పట్టదా అని ప్రశ్నించాడు. మేమేం పాపం చేసాం.. మాకూ వితంతు పింఛన్ ఇప్పించి పుణ్యం కట్టు కోండమ్మయ్య అంటూ వేడుకున్నాడు. నాలాంటి వారి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లండి.

మాకూ వితంతు పింఛను వచ్చేలా చూడండి..మీకు రుణపడి ఉంటాం తల్లీ అంటూ రెండు చేతులెత్తి వేడుకోవడం అందరినీ ఆలోచింపజేసింది.ఎవర్రా అయ్యా నువ్వు ఇంత టాలెంట్‌గా ఉన్నావంటూ అక్కడికొచ్చిన వారు అనకుండా ఉండలేకపోయారు.

# ‘లూలూ’కు విజయవాడ పాత బస్టాండ్?

**- విద్యాధరపురం డిపో కూడా!**
**- రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు**
**- ఆర్‌టిసికి గొల్లపూడి వద్ద ప్రత్యామ్నాయ స్థలం**

**అమరావతి - సూర్య వాస్తవం , జూలై 18:** విజయవాడ నడిబడ్డున ఉన్న ఆర్‌టిసి పాత బస్టాండ్ (ప్రస్తుతం గవర్నర్ పేట బస్‌డిపో)ను బడా కార్పొరేట్లకు అప్పగించడానికి రంగం సిద్ధమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ స్థలాన్ని అంతర్జాతీయ వాణిజ్య సంస్థ లూలూకు కేటాయించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే ఆర్‌టిసి, రెవెన్యూ అధికారులు డిపో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. పాత బస్టాండ్ తోపాటు విద్యాధరపురంలోని ఆర్‌టిసి డిపోను కూడా మూసి వేసి, ఆ స్థలాన్ని కూడా లూలూ సంస్థకు అప్పగిం చనున్నట్లు చెబుతున్నారు. ఈ రెండు స్థలాలకు ప్రత్యా మ్నాయంగా ఆర్‌టిసికి గొల్లపూడి సమీపంలోని రాళ్లకుంట వద్ద ఆరు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించనుందని సమాచారం. దీంతో ఈ విషయం ఆర్‌టిసి వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారం ఈ నెల 24వ తేదీన జరగనున్న రాష్ట్ర



మంత్రిమండలి సమావేశం ముందుకు ఈ ప్రతిపాదన రానుంది. ఇప్పటికే అవసరమైన కసరత్తు పూర్తికావడంతో ఆ సమావేశంలోనే ఆమోదముద్ర పడుతుందని చెబుతున్నారు. మార్కెట్ రేటు ప్రకారం పాత బస్టాండ్ స్థలం విలువ రూ.300 కోట్ల నుండి 400 కోట్ల రూపాయలు ఉంటుందని చెబుతున్నారు. విద్యాధరపురం డిపో విలువ కూడా భారీ మొత్తంలోనే వుంది. ఇంత విలువైన స్థలాన్ని బహుళజాతి సంస్థకు అప్పగిస్తుండటంపై ఆర్‌టిసి వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాత బస్టాండ్ స్థలంలో లూలూ ఇంటర్నేషనల్ కంపెనీ పెద్ద కమర్షియల్ మాల్ నిర్మించనుందని చెబుతున్నారు. విద్యా ధరపురం స్థలాన్ని కూడా లూలూ సంస్థకే అప్ప చెప్పనున్నారని, అయితే, అక్కడ మాల్ నిర్మిస్తారాం ఇతర అవసరాలకు వినియోగిస్తారా అన్న అంశంపై స్పష్టత లేదని చెబుతున్నారు. గతంలో గన్నవరం వద్ద ఆర్‌టిసి స్థలాన్ని ఓ కార్పొరేట్ కంపెనీకి కేటాయిస్తే ఇంత వరకు అక్కడ ఎటువంటి వ్యాపార కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాల్లేవు. తాజాగా విద్యుత్తు బస్సుల నిర్వహణ పేరుతో ఆర్‌టిసి స్థలాలు, భవనాలను కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేటు వ్యక్తులకు నామమాత్రపు లీజుతో కట్టబెట్టే యోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. స్థలాలకు మంచి గిరాకీ ఉండటం, పట్టణాల మధ్యలో ఆర్‌టిసి డిపోలు ఉండటంతో కార్పొరేట్లు ఆయా స్థలాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారని, ఆర్‌టిసి ఉద్యోగులు అంటున్నారు.



## ఒకరిద్దరు నాయకులతో పార్టీ నడవదు

**- వైసీపీ క్యాడర్ మా వైపే ఉంది**

**హిందూపురం రూరల్ -సూర్య వాస్తవం, జూలై 18:** హిందూపురంలో బహిష్కృత నేతలు నవీన్ నిచ్చల్ కొండూరు వేణుగోపాల్ రెడ్డి పార్టీలో లేకున్నా కూడా పార్టీని బలోపేతం చేస్తామని ఒకరిద్దరితో నాయకులతోపార్టీ నడవదని పార్టీకి ముఖ్య వైసిపి కార్యకర్తలే అని కార్యకర్తలకు అండగా ఉంటామని పురం నియోజకవర్గం వైకాపా నేత గుడ్డంపల్లి వేణురెడ్డి వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దీపిక తెలిపారు. చిలమత్తూరులో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సస్పెన్షన్ ఎత్తేసే నిర్ణయం అధిష్టానం దని అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని అన్నారు. బహిష్కృత నేతల వద్ద ఉన్న కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కలిసి మాతో కలుపుకుంటామన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ
## ఇద్దరికి తీవ్రగాయాలు

**హిందూపురం రూరల్ -సూర్య వాస్తవం, జులై 18:** లేపాక్షి మండల పరిధిలోని పూలకుంట సమీపంలో శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాయన పల్లి కి చెందిన మూర్తి హిందూపురానికి వస్తుండగా, కొండూ రుకు చెందిన నరసింహప్ప హిందూ పురం నుండి లేపాక్షి వైపుకు వస్తూ ప్రమా దవశాత్తు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘ టనలో నరసింహప్పకు తీవ్ర గాయాల య్యాయి. అంబులెన్స్ ప్రమాద స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 18:**జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో... జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు పోలీసులు.అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా వాహనాలను తనిఖీ చేపట్టారు.అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలోని కూడళ్ళ... జాతీయ ,రాష్ట్రీయ రహదారులపై ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు.ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని... సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌లకు దూరంగా ఉండాలని సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసుల చర్యలు చేపట్టారు.మైనర్ల వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలియజేశారు.అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టీవ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధించాలని ఆదేశాలు జారీ చేశారు.

## తాడిపత్రిలో హైటెన్షన్....

**- కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు....**

**తాడిపత్రి - సూర్య వాస్తవం, జూలై 19:** తాడిపత్రి లో మరోసారి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డిల మధ్య నెలకొన్న సవాళ్లు, ప్రతిసవాళ్లతో తాడిపత్రిలో ఉద్రిక్తత నెలకొంది.శుక్రవారం ఉదయం కేతిరెడ్డి పెద్దారెడ్డి తన సొంతూరు తిమ్మంపల్లిలో పోలీసులకు అడ్డుపడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం సిద్ధమయ్యారు. అయితే, ఆయన స్వగ్రామం అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లిలోని ఆయన ఇంటి వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. కేతిరెడ్డిని తాడిపత్రి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాడిపత్రిలోకి రానిచ్చేది లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి ఇప్పటికే తీవ్రంగా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తిమ్మంపల్లితో పాటు తాడిపత్రిలోనూ పోలీసులు భారీగా మోహరించారు.



### అనారోగ్య సమస్యతో బాధపడుతున్నవారికి

## సీఎం సహాయ నిధి ఓ వరం

### - టిడిపి నియోజకవర్గ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



**రాయచోటి- సూర్య వాస్తవం, జులై 18:** రాయచోటి నియోజకవర్గం రామాపురం మండల పరిధిలోని హోసనపురం గ్రామం చెందిన వసంత జయచంద్ర రెడ్డి అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స పొందిన అతనికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన 70 వేల రూపాయలు చెక్కును వారి గ్రామ నాయకులు సమక్షంలో అందించారు. చెక్కు అందుకున్న సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి, లక్ష్మీప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు .

## జీరో పావర్టీ పి4పై వార్డుల వారీగా సభలు



**గుత్తి - సూర్యవాస్తవం, జూలై 18:** గుత్తి జీరో పావర్టీ-పి4లో భాగంగా శుక్రవారం ఉదయం11.30 నుం డి మధ్యాహ్నం12.30 వరకు సచివాలయం.6 నేసే వీధి 1,సచివాలయం7, నేసేవీధి 2, మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.30 గంట ల వరకు సచివాలయం10 సి.పి. ఐ కాలనీ-2 ల యందు బంగారు కుటుంబముల సమక్షంలో వార్డు సభ నిర్వహించడమైనది. ఇందు లో జీరో పావర్టీ పి4 కు సంబంధిం చి ఉద్దేశ్యము,బంగారు కుటుంబా ల ఎంపిక, మార్గదర్శుల అడాప్షన్ గురించి మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా వివరించారు. సభ యందు రీవాలిడే షన్ ప్రక్రియ కూడా చేపట్టడమైన దని కమీషనర్ బి.జబ్బార్ మి యా తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, సి.ఓ లు చం ద్రశేఖర్, ప్రసన్న బాబు, సచివాల య సిబ్బంది,మెప్మా ఆర్.పిలు మహిళా సంఘాల సభ్యులు పా ల్గొన్నారు.

## మంత్రి మండిపల్లిని కలిసిన లక్కిరెడ్డిపల్లె మార్కెట్ చైర్మన్



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 18:** రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వగ్రామం నందు నూతనంగా లక్కిరెడ్డిపల్లె మార్కెట్ చైర్మన్ గా ఎన్నికైన షేక్ షఫీ నాయక్ మంత్రిని కలిసి చైర్మన్ పదవి ఇచ్చి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దుశ్యాలవాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురుకి గాయాలు



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 18** :రోడ్డు ప్రమాదంలో ఐదుమంది యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం వేకువ జామున మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. పీలేరుకు చెందిన తరుణ్, అష్రఫ్, నిఖిల్, బాలాజీ, ప్రేమ్ కుమార్‌లు సొంత పనిమీద గురువారం రాత్రి కారులో మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకొని శుక్రవారం వేకువజామున రెండున్నర గంటలకు కారులో పీలేరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. కారు మార్గమధ్యంలోని సీటీఎం రోడ్డు, కొత్తవారిపల్లి సమీపంలోని కొత్త బైపాస్ రోడ్డు వద్ద కారు డివైడర్ ను ఢీకొట్టి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు108 కు సమాచారం అందించి క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నత్తనడకన అంగన్వాడీ కేంద్రాలు..

- చూసి చూడనట్లు సంబంధిత అధికారులు
- రాయచోటి తదితర ప్రాంతాల నుంచి విధులకు హాజరు
- చర్యలు తీసుకోవాలంటూ ఐసిడిఎస్ పీడీకి గ్రామస్తుల విన్నపం





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 18 :** అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ పరిధిలోని వీరబల్లి మండలం పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి అంగన్వాడి కేంద్రాలు నత్తనడకన సాగుతున్నట్లు గ్రామాల్లోని ప్రజల నుండి తెలిసింది అంగన్వాడి సెంటర్లకు విధులకు వచ్చే అంగన్వాడి టీచర్లు రాయచోటి తదితర ప్రాంతాల నుంచి రావడం జరుగుతుందని అంతేకాకుండా సకాలంలో చిన్నారులకు పోషక పదార్థాలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అంగన్వాడి సెంటర్లకు తనికి నిమిత్తం వచ్చే అధికారులు కూడా నామమాత్రంగా వచ్చి పోతూ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై అంగన్వాడి టీచర్లు తమ విధులు, నత్త నడకన నడిపిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఎక్కువగా వీరబల్లి మండలంలోని పలు గ్రామపంచాయతీలోని అంగన్వాడి సెంటర్లలలో చిన్నారులు కూడా తక్కువ మోతాదులోనే ఉన్నారని కొన్నిచోట్ల అసలు లేరని ఉన్నట్లు సృష్టించి వారికి హాజరవేస్తూ పోషక పదార్థాలు తీసుకుంటూ ఉన్నట్లు ఆరోపణలు రానే వస్తున్నాయి ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు తమ చర్యలు తీసుకొని నత్తనడకన సాగే అంగన్వాడి కేంద్రాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా లేకపోలేదు.

# గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం: ఎమ్మెల్యే సునీత



**రాప్తాడు- సూర్య వాస్తవం, జూలై 18:** ఐదేళ్ల వైసిపి పాలనలో చేయలేని పనులను ఒక ఏడాదిలోనే చేసి చూపిస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.రామగిరి కస్తూరిబా పాఠశాలలో రూ.1కోటి 60 లక్షల తో నిర్మిస్తున్న అదనపు భవనాలకు ప్రభుత్వ అధికారులు టిడిపి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు.పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. మొత్తం పాఠశాలల్లో ఉన్న అన్ని గదులను పరిశీలించారు.అక్కడున్న ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం సుద్ధకుంటపల్లి గ్రామానికి వెళ్ళగా అక్కడ గ్రామస్తులు టిడిపి నాయకులు పూలమాలతో ఘనస్వాగతం పలికారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సునీత ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రామగిరి మండలంలో ఎంత అభివృద్ధి చేశామన్నది ప్రజలకు తెలియజేశారు.



పథకాల గురించి కూడా ఆరా తీశారు.తల్లికి వందనం పింఛన్లు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.సంక్షేమ పథకాల విషయంలో దాదాపుగా అన్నిచోట్ల సంతృప్తి కనిపించింది అని అన్నారు. ప్రజలు కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుంటిమద్ది పంచాయతీలో రూ.2 సీసీ రోడ్లు 32 లక్షల 50 వేలతో నిర్మించామన్నారు.

602 మందికి సంవత్సరానికి రూ.3 కోట్ల 13 లక్షలు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముగ్గు రికి రూ.15 లక్షల సీఎం సహాయ నిధి అందిందన్నారు. అలాగే 19 మందికి రూ.14 లక్షల 83 వేలు సబ్సిడీతో డ్రిప్ స్పింకర్లు అందించామ న్నారు. తల్లికి వందనం 544 మందికి రూ.70 లక్షలు 72 వేలు అందింది.1402 రేషన్ కార్డులు ఇతర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిమని వివరించారు. రామగిరి మండలంలోనే వివిధ పథకాల కింద రూ.18 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టాము. పాఠశాలల్లో 1 కోటి 67 లక్షలతో సౌకర్యాలు అదనపు గదుల నిర్మాణం చేపట్టాము. ఇలా చెబుతూ పోతే ఏడాది కాలంలోనే వైసిపి నాయకులు చేయలేని అభివృద్ధి సంక్షేమాన్ని చూపించమన్నారు.ప్రతి గ్రామంలో మనం చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు.ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు అందాయంతో సంతోషం కూడా కనిపిస్తోంది అని తెలిపారు.రానున్న నాలుగేళ్లలో అన్ని చెరువులకు నీరు అందించడంతోపాటు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మండల టిడిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# రానున్నది విద్యుత్ వాహన వినియోగాల తరం

- ఏడిఎంఎస్ సంస్థ ప్రతినిధి జే.యం.డి గౌస్
- కుప్పంలో ఏడిఎంఎస్ ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభం



**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 18 :** కుప్పం పట్టణంలో విద్యుత్ బ్యాటరీలతో నడిచే షోరూం శుక్రవారం ప్రారంభించారు.ఏడిఎంఎస్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుప్పం పట్టణ ప్రాంత ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి జె ఎం డి గౌస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇకపై విద్యుత్ బ్యాటరీ వాహనాల వినియోగం ఎక్కువ కానుందని తెలిపారు. తమ ఎడిఎంఎస్ సంస్థకు దేశ వ్యాప్తంగా 1500కు పైగా శాఖలు ఉన్నాయని ఆయన తెలిపారు. 3,80,000 వినియోగదారులు తమ కంపెనీలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా సుమారు 600 కోట్ల టర్నోవర్ తో తమ సంస్థ పురోగతి సాధిస్తోందని తెలిపారు. అడ్వాన్స్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్మెంట్ సిస్టం (ఎడిఎంఎస్) పేరుతో తమ సంస్థలో ద్విచక్ర, త్రిచక్ర, వాహనాలను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో తయారు చేసామని తెలిపారు. తమ సంస్థలో నేరు విక్రయాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం తమ వాహనాల వినియోగంలో సామాన్య ప్రజల దగ్గర నుంచి కార్పొరేట్ స్థాయి వరకు వాహనాలు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. కుప్పం ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలోని ప్రజలు చాలా చైతన్యవంతులుగా ఉన్నారని తెలిపారు. రానున్న కాలంలో పెట్రోల్ డీజిల్ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం చెల్లు చీటీ పాడనున్న నేపథ్యంలో విద్యుత్ బ్యాటరీలతో నడిచే వాహనాల వినియోగం భవిష్యత్తులో పెరగనుందని తెలిపారు. తమ షోరూమ్లలో వాహనాలకు చిన్న చిన్న సమస్యలు ఏర్పడితే ఇక్కడే సర్వీసింగ్ చేసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీకోట ఏ డి ఎం ఎస్ బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ,కుప్పం బ్రాంచ్ మేనేజర్ చంద్ర, సంస్థ ప్రతినిధులు ఖాజా హుస్సేన్, మునెప్ప, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.





PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )